పేదల బతుకులకు భరోసా

- ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్
- ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన పట్ల ప్రజల హర్షం
- సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరించి, జెండా ఎగురవేసిన ఎమ్మెల్యే వాసుపల్లి

ప్రజలకు కోట్లాది రూపాయల లబ్ధిని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎలాంటి వివక్షకు తావు లేకుండా పారదర్శకంగా అందించారని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ కొనియాడారు. జాలారిపేట సచివాలయంలో జరిగిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో పాల్గొన్న ఆయన సంక్షేమ పథకాల బోర్డును, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు.


జాలారిపేటలో జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్


జాలారిపేట సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్. చిత్రంలో కార్పొరేటర్ అప్పలరత్నం తదితరులు

మహారాణిపేట : లంచాలు, వివక్షకు తావు లేకుండా అర్హులందరికీ సంక్షేమ లబ్ధిని అందజేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం బుధవారం నియోజకవర్గం పరిధి 30వ వార్డు జాలారిపేట సచివాలయంలో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం జాలారిపేట పిల్లప్పయ్య క్లబ్ కమ్యూనిటీ భవనం ఆవరణలో పార్టీ జెండా ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్ల సీఎం జగన్ పాలనలో చేసిన సంక్షేమం, అభివృద్ధి గురించి వివరించారు. 30వ వార్డు జాలారిపేట సచివాలయం పరిధిలో ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) మొత్తం రూ.16 కోట్ల 33 లక్షలు, పరోక్ష ప్రయోజనాలు (నాన్ డీబీటీ) రూ.8 కోట్ల 56 లక్షలు కలిపి మొత్తం రూ.24 కోట్ల 89 లక్షలు అర్హులైన అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ములు, అవ్వాతాతలకు అందజేసినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ పథకాల ద్వారా అర్హులైన పేదలందరికీ డీబీటీ+నాన్ డీబీటీ ద్వారా రూ.4,69,459.45 కోట్ల లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు.

నాటి పాలనకు.. నేటి పాలనకు బేరీజు వేసుకోవాలి..

గత ప్రభుత్వ పాలన, నేటి జగనన్న పాలనను బేరీజు వేసుకుంటే స్పష్టమైన తేడా కనిపిస్తుందని తెలిపారు. పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందించాలనే ఉద్దేశంతో సీఎం జగన్ ఎన్నో వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో 30వ వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం, పార్టీ మండల అధ్యక్షుడు పీతల వాసు, క్లస్టర్ ఇన్‌చార్జి కోన శంకర్, వార్డు ప్రెసిడెంట్ దశమంతుల మాణిక్యాలరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పెంటపల్లి సత్యనారాయణ, పెంటపల్లి చిన్ని, శ్యామ్, వెంకట్, రామలక్ష్మి, జగన్, వేణుగోపాల్, కల్యాణి, రాము, మణి, మీనా, మంజు, కోరాడ సురేష్, సంతోష్, బాలు, రామరాజు, జీవీఎంసీ అధికారులు ఏపీడీ పుణ్యవతి, సచివాలయ సిబ్బంది, సీవోలు, ఆర్పీలు, వందల సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

క్లుప్తంగా

రహదారులు పరిశుభ్రంగా ఉంచాలి


గాజులవీధిలో రహదారులు శుభ్రం చేయిస్తున్న ఏఎంహెచ్‌వో రాజేష్

జగదాంబ : రహదారులు పరిశుభ్రంగా ఉంచాలని జీవీఎంసీ జోన్-4 ఏఎంహెచ్‌వో ఎ.రాజేష్ అన్నారు. బుధవారం జోన్ పరిధి వార్డుల్లో ఆయన పర్యటించారు. 35వ వార్డు గాజులవీధిలో రహదారులను పారిశుధ్య సిబ్బందితో శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోన్ పరిధిలో రహదారులపై చెత్త లేకుండా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఎప్పటికప్పుడు ఎత్తించి డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. కాలువలు కూడా శుభ్రం చేయాలన్నారు. వారంలో రెండు రోజులు టీఎం మిషన్ల ద్వారా కాలువల్లో చెత్త ఎత్తించి నీటి ప్రవాహానికి అడ్డు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కెనాల్‌కు వెళ్తున్న ప్రధాన కాలువలైన పందుపల్లల సందు, స్టేడియం దగ్గరున్న కాలువలపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ కిశోర్, ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

డీసీఎస్ ఆర్ఎంవోకు పదోన్నతి


డాక్టర్ వాసుదేవ

మహారాణిపేట : కేజీహెచ్ డిప్యూటీ సివిల్ సర్జన్ ఆర్ఎంవోగా పని చేస్తున్న డాక్టర్ ఎ.వాసుదేవకు పదోన్నతి లభించింది. సివిల్ సర్జన్ ఆర్ఎంవోగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. పుట్టపర్తి సత్యసాయి జిల్లా జాతీయ అంధత్వ నివారణ ప్రాజెక్టు చీఫ్‌గా ఆయనను నియమించారు. గత ఏడాది మే 4వ తేదీ నుంచి నుంచి డాక్టర్ వాసుదేవ కేజీహెచ్‌లో డీసీఎస్ ఆర్ఎంవోగా పని చేస్తున్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

కార్టూన్ కళలో బాలలకు శిక్షణ

ఆరిలోవ: బాలల హక్కుల వారోత్సవంలో భాగంగా దీన్‌దయాల్‌పురంలోని ప్రభుత్వ బాలుర పరిశీలన గృహంలో బుధవారం 'కార్టూన్లు–బాలల అంశాలు' అనే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రముఖ కార్టూనిస్ట్ బి.హరి వెంకటరమణ ఇక్కడి విద్యార్థులకు కార్టూన్ వేయడంలో శిక్షణ ఇచ్చారు. గృహం సూపరింటెండెంట్ కె.వీరయ్య, సిబ్బంది వై.చిరంజీవి, డాక్టర్ ఫణీంద్ర పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు


వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

అల్లిపురం : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా అల్లిపురం శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. నీలమ్మ వేపచెట్టు దరి గల ప్రియాంక విద్యోదయ హైస్కూల్ విద్యార్థులకు గ్రంథాలయాలు వాటి ఉపయోగాలు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి పీవీఎన్ రాజు తెలిపారు. విజేతలకు వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

నేడు పుస్తక ప్రదర్శన..

గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం పుస్తక ప్రదర్శన నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి పీవీఎన్ రాజు తెలిపారు.

సూపర్‌స్టార్ కృష్ణకు ఘన నివాళి


కృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

డాబాగార్డెన్స్ : తెలుగు సినీ చరిత్రలో సంచలనాలు సృష్టించిన సూపర్‌స్టార్ కృష్ణ అని విశాఖ సిటీ కృష్ణ అండ్ మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ సరస్వతీ పార్క్ సభ్యులు కొనియాడారు. కృష్ణ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని సరస్వతీ పార్క్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, అభిమానులు పాల్గొని కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రేమసమాజంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. బీసీహెచ్ అప్పారావు, వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్, ఎస్. రాంబాబు, న్యూకాలనీ చిన్న, షేక్ మదీనా, శ్రీను, సంతోష్‌కుమార్, రాజు, సన్యాసిరావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన కులాల సంక్షేమ సేవా సంఘం, మత్స్య పరిశ్రమ సంక్షేమ సేవా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఫిషింగ్ హార్బర్ వద్ద కృష్ణ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు పిల్లా నూకరాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొణతాల శ్రీనివాస్, కొనాడ అప్పారావు, ముస్నం బాలాజీ, కె. చిన్నారావు, గంగాధర్‌రావు, గోపాల స్వామి, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు భోజనాల వితరణ



సేవా కార్యక్రమం నిర్వహిస్తున్న సంస్థ సభ్యులు

డాబాగార్డెన్స్ : ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు (లెబెన్‌షిల్ఫే పాఠశాల)కు రౌండ్ టేబుల్ సంస్థ 5 రకాల ప్రత్యేక వంటకాలతో బుధవారం భోజనాలు అందజేసింది. విద్యార్థుల అవసరాలు గుర్తించి, వారికి సేవలందిస్తున్న సిబ్బందికి చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు మక్సూద్ అహ్మద్, కల్యాణ్ ఆదిత్య, దినేష్ యలమాత్రి, సుప్రజ్ సాకేత్, సందీప్‌రెడ్డి, అరవింద్ గొల్లు పాల్గొన్నారు.

రేపు మెగా జాబ్‌మేళా

కంచరపాలెం: కంచరపాలెం జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో క్లరికల్, టెక్నికల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 17న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్) ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అపోలో ఫార్మసీస్, వరుణ్ మోటర్స్, శ్రీరామ్ చిట్స్, ముత్తూట్ ఫైనాన్స్, టాటా క్యాపిటల్, దక్కన్ ఫైన్ కెమికల్స్, స్పెక్ట్రమ్ టాలెంట్ మేనేజ్‌మెంట్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 500 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. రిటైల్ ట్రెనింగ్ అసోసియేట్, ఫార్మాసిస్ట్, జూనియర్ ట్రైనీ, డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్స్, ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, ఆఫీస్ అసిస్టెంట్, అకౌంట్స్, అసిస్టెంట్, రికవరీ, క్లర్క్, బ్రాంచ్ ఇన్‌చార్జి, వేర్‌హౌస్ ఎగ్జిక్యూటివ్స్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, పీజీ, 18–35 ఏళ్ల వయసు గల పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. కంచరపాలెం జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు.

కల్లుపాకల్లో అప్రమత్తం


కల్లుపాకల్లోని ఓ ఇంట్లో ఫాగింగ్ చేయిస్తున్న ఏఎంహెచ్‌వో రాజేష్

జగదాంబ : కల్లుపాకలు ప్రాంతంలో పరిశుభ్రతపై జీవీఎంసీ ఏఎంహెచ్‌వో రాజేష్ తన సిబ్బందితో అప్రమత్తమై ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. కల్లుపాకల్లో డెంగ్యూ కేసు నమోదు కావడంతో ఆ ప్రాంతంలో బ్లీచింగ్ చల్లించడంతో పాటు ఫాగింగ్ చేయించారు. ఏఎన్ఎంలు, మెడికల్ సిబ్బందితో ఇంటింటా జ్వరాల పరిశీలన చేశారు. పారిశుధ్య సిబ్బంది కాలువలు శుభ్రం చేశారు. వార్డులో ఎక్కడా చెత్త, తాగి పడేసిన కొబ్బరి బొండాలు, టైర్లు లేకుండా చర్యలు తీసుకున్నారు. మలేరియా సిబ్బంది ఇళ్లలోని నిల్వ నీటిని పారబోయించారు. ఫ్రిజ్‌ల వెనుక ఉండే నీటిని తీయించి స్ప్రేయింగ్ చేశారు.

సాఫ్ట్‌స్కిల్స్‌తో ఆత్మవిశ్వాసం


వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న డాక్టర్ కృష్ణవీర్

కంచరపాలెం : విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడంతో పాటు భయాన్ని పోగొట్టడంలో సాఫ్ట్ స్కిల్స్ కీలక పాత్ర పోషిస్తాయని భాషావేత్త, సెంటర్ ఫర్ ఎమోషనల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణవీర్ అన్నారు. జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ ఆధ్వర్యంలో బుధవారం 'లైఫ్ స్కిల్స్ ద్వారా విద్యార్థులను సాధికారత పరచడం' అనే అంశంపై నాలుగు రోజుల వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. జ్ఞానాన్ని బుద్ధి పూర్వకంగా సంపాదించడానికి, విద్యార్థులు సామర్థ్యంతో కూడిన నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి కమ్యూనికేషన్ అడ్డంకులను వీలైనంత త్వరగా పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహనతోనే బాల్యవివాహాలకు బ్రేక్


పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేసీ విశ్వనాథన్, న్యాయమూర్తి శేషమ్మ, డీఈవో చంద్రకళ తదితరులు

మహారాణిపేట: చట్టాలపై అవగాహనతోనే బాల్యవివాహాలను అరికట్టగలమని జాయింట్ కలెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్ పేర్కొన్నారు. జేసీ అధ్యక్షతన బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత అధికారులతో బాల్యవివాహాల నివారణపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, ఎవరైనా వీటికి పాల్పడినా.. సహకరించినా కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. వివాహ సమయంలో అమ్మాయిలకు 18 ఏళ్లు, అబ్బాయిలకు 21 ఏళ్లుగా పేర్కొంటూ వయసు నిర్ధారణ పత్రాలు ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. దీనిపై అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం బాలల హక్కుల పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో డీఎల్ఎస్ఏ జిల్లా కార్యదర్శి, న్యాయమూర్తి ఎం.వి.శేషమ్మ, డీఆర్వో కె.మోహన్‌కుమార్, డీఎల్డీవో పూర్ణిమాదేవి, ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి, దిశ డీఎస్పీ సీహెచ్ వివేకానంద, డీఈవో చంద్రకళ, ఎన్జీఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఢిల్లీలో 24న ఆశ్రా జాతీయ సదస్సు


ఎంపీ ఎంవీవీ చేతుల మీదుగా సదస్సు పోస్టర్ ఆవిష్కరింపజేస్తున్న ఆశ్ర ప్రతినిధులు

డాబాగార్డెన్స్ : భారతదేశంలో అత్యంత ప్రతిష్టాత్మక వినియోగదారుల సంస్థ ఆశ్ర (అడ్వకేట్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ అవేర్‌నెస్) 5వ జాతీయ సదస్సు ఈ నెల 24న దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించనున్నట్టు సంస్థ అంతర్జాతీయ అధ్యక్షుడు పొలమరశెట్టి రత్నరాజు తెలిపారు. ఈ మేరకు సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా పొలమరశెట్టి మాట్లాడుతూ సెలబ్రిటీ గెస్ట్‌గా టాలీవుడ్ యాక్టర్ అలీ, భారతదేశ వినియోగదారుల సంఘం కార్యదర్శి రోహిత్‌కుమార్ సింగ్, అమెరికా ఆపరేషన్ హెడ్ హరికృష్ణ, సౌత్ కొరియా ఇనరీసస్ వ్యవస్థాపకుడు హంగ్‌సున్‌యంగ్, బాబూభాయ్, ఆర్ఆర్ టీమ్, ఖంటీయం తదితరులు హాజరు కానున్నారని చెప్పారు. జాతీయ స్థాయిలో వినియోగదారులకు అవగాహన కల్పించి వారికి ప్రతిభా అవార్డులు అందజేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు ఇక్బాల్ తెలిపారు. కార్యక్రమంలో ఈవెంట్ హెడ్ వీరూమామ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి ప్రసూతి అధ్యయన కార్యక్రమాలు

మహారాణిపేట : ప్రసూతి, గైనకాలాజికల్ సొసైటీ 56వ వార్షిక కార్యక్రమంతో పాటు నిరంతర విద్య కార్యక్రమం (సీఎంఈ) ఈనెల 18వ తేదీ నుంచి రెండు రోజుల పాటు విశాఖలో నిర్వహించనున్నారు. ప్రసూతి, స్త్రీ జననేంద్రియ రంగంలో తాజా మార్గదర్శకాలు, నవీకరణల గురించి ఈ కార్యక్రమంలో చర్చించనున్నట్లు అధ్యక్షుడు డాక్టర్ వి.సీతారామరాజు తెలిపారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, కాకినాడ, తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున ప్రారంభిస్తారని సొసైటీ కార్యదర్శి డాక్టర్ అల్లు నిహారిక తెలిపారు.

ఘనంగా సామూహిక సీమంతాలు


మహిళలకు సీమంతాలు చేస్తున్న నాయకులు

అల్లిపురం : నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ నాయకుడు సీతంరాజు సుధాకర్ సహకారంతో జీవీఎంసీ 33వ వార్డులో బుధవారం సామూహిక సీమంతాలు ఘనంగా నిర్వహించారు. వార్డు అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ ఆధ్వర్యంలో కుమ్మరవీధి సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో వార్డు మహిళా అధ్యక్షురాలు ఎల్లంకి చిన్నమ్మలు, మేడం నారాయణరెడ్డి, పాల శ్రీహరిరెడ్డి, నీలాపు అయ్యప్పరెడ్డి, ఖీశెట్టి రాజు, ఆడారి వెంకట మహేష్, మదీనాఖాన్, బూర్ల చిన్న తదితరులు పాల్గొని గర్భిణులకు చీర, సారె, గాజులతో పాటు దీవెనలు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ మహిళల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. మహిళా సాధికారతే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడివీధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ 30వ వార్డు తాడివీధి సచివాలయం పరిధి పలు ప్రాంతాల్లో బుధవారం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పీతల వాసు, కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి బుక్‌లెట్లు అందజేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు, నెరవేర్చినవి వివరిస్తూ సచివాలయ పరిధిలో పర్యటించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, కన్వీనర్లు కల్యాణి, ముచ్చల జ్యోతి, కాకర మీన, దశమంతుల రామలక్ష్మి, మణి, రాము, వై. సంతోష్, గృహ సారథులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లపై చర్యలకు పరిశీలించాలి



మహారాణిపేట పోలీస్ స్టేషన్‌లో సీఐలకు సూచనలిస్తున్న సీపీ డాక్టర్ రవిశంకర్

అల్లిపురం : రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లపై పీడీ యాక్ట్ నమోదు చేసే అంశాన్ని పరిశీలించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ. రవిశంకర్ మహారాణిపేట, హార్బర్ పోలీస్ స్టేషన్ల సీఐలకు సూచించారు. మంగళవారం ఆయన మహారాణిపేట, హార్బర్ స్టేషన్లతో పాటు టూటౌన్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, సీసీఎస్ పోలీస్ స్టేషన్లను సందర్శించారు. అక్కడి పారిశుధ్యంపై ఆరా తీశారు. రికార్డులు పరిశీలించారు. ముఖ్యంగా స్టేషన్ల పరిధిలో గల రౌడీ షీటర్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహారాణిపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణపై ఆరా తీశారు. ముఖ్యంగా బీచ్‌రోడ్డులో ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు ప్రమాదాలపై సమీక్షించారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు అందజేశారు. స్టేషన్‌లో సీజ్ చేసిన వాహనాలను త్వరితగతిన తిరిగి ఇచ్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

విద్యార్థుల ఉన్నతికి దోహదం.. గ్రంథాలయాలు

- కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు


మహిళా కళాశాలలో వ్యాస రచన పోటీలో పాల్గొన్న విద్యార్థినులు


జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న సుబ్రహ్మణ్యవర్మ


ఏవీఎన్ కళాశాలలో ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు, కళాశాల యాజమాన్యం


బాలల శాఖా గ్రంథాలయంలో పుస్తకాలు తిలకిస్తున్న సీతంరాజు సుధాకర్ తదితరులు

డాబాగార్డెన్స్ : విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాల రెండో రోజున 'బెస్ట్ ప్రాక్టీసెస్ టు ఇంప్రూవ్ లైబ్రరీ సర్వీసెస్' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి మాట్లాడుతూ లైబ్రరీ సేవల వినియోగం విద్యార్థుల జీవితంలో ఉన్నత స్థాయికి చేరడానికి తోడ్పడుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లైబ్రరీ విభాగాధిపతి డాక్టర్ ఎ. ధరణి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డి. అరుణపద్మ, డాక్టర్ ఎ. హైమావతి, డాక్టర్ బి. హైమావతి, ఎస్. నిర్మలాకుమారి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో..

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బుధవారం పుస్తక ప్రదర్శనను వయోజన విద్యాశాఖ సంచాలకుడు ఎస్. సుబ్రహ్మణ్యవర్మ ప్రారంభించారు. పిల్లల పుస్తకాలు, నవలలు, మహాభారతం, రామాయణ గ్రంథాలు, కథల పుస్తకాలు, పోటీ పరీక్షల పుస్తకాలను ప్రత్యేక స్టాల్స్ ద్వారా ఏర్పాటు చేశారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు సుబ్రహ్మణ్యవర్మ పర్యవేక్షణలో నిర్వహించారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులచే ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో వయోజన విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డి. చిన్నకృష్ణ, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకట్రావు, ఇన్‌చార్జి డిప్యూటీ లైబ్రేరియన్ పీవీ నూకరాజు, జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

బాలల శాఖా గ్రంథాలయంలో..

జీవీఎంసీ 36వ వార్డు పరిధి రంగిరీజువీధిలో గల బాలల శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సీతంరాజు సుధాకర్, 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్, మాజీ కార్పొరేటర్ కొప్పుల వెంకట్రావు పాల్గొని పుస్తక ప్రదర్శనను ప్రారంభించి తిలకించారు. ప్రదర్శనలో బీఈడీ, ఆర్ఆర్‌బీ, గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4, బ్యాంక్ పోటీలకు సంబంధించిన పుస్తకాలతో పాటు మత గ్రంథాలు, ఆయుర్వేద పుస్తకాలు, బాల సాహిత్యం, అకాడమీ పుస్తకాలు, డిక్షనరీలు, వ్యాకరణం, హాస్యం, నవలలు, సైన్స్, కంప్యూటర్ తదితర పుస్తకాలు ప్రదర్శించారు. గ్రంథాలయ అధికారి పోలితల్లి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కోరుకొండ సూర్యప్రసాద్, అలమండ విజయ్, రామచంద్ర, ఉపాధ్యాయురాలు శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ఏవీఎన్ కళాశాలలో..

ఏవీఎన్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు ఎస్సార్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రంథాలయ ఆవశ్యకతపై ప్రిన్సిపాల్‌తో పాటు కళాశాల డీన్ జి. శంకరనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాల్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయ అధికారి ఎం. స్వరాజ్యలక్ష్మి విద్యార్థుల భవితకు గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.